క్లుప్తంగా

ఇరుముడులతో పుణ్యక్షేత్రాలకు..



ఇరుముడులతో పుణ్యక్షేత్రాలకు పయనమవుతున్న శివస్వాములు

మునగపాక: మునగపాకలో మాలలు ధరించిన శివస్వాములు సోమవారం ఇరుముడులతో పుణ్యక్షేత్రాలకు పయనమయ్యారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి మాలలు స్వీకరించిన భక్తులు తమ పూజల అనంతరం మాలలు విరమించేందుకు సోమవారం మునగపాక సాంబశివ ఆలయం ప్రాంగణంలోని పీఠం వద్ద ఇరుముడులు కట్టారు. అక్కడ నుంచి పుణ్యగిరి, ద్రాక్షారామం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలకు కార్లు, బైక్‌లపై పయనమయ్యారు. గురుస్వామి జోగారావు, వేద పండితుడు సాయి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



మంగవరంలో శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో రూ.2 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఏఈ కచేరీ తెలిపారు. ఆయా గ్రామాల్లో 37 సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ రోడ్లను ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మాదక ద్రవ్యాల మత్తులో పడొద్దు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ అప్పన్న

పాయకరావుపేట: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ జి.అప్పన్న సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తిరుమల కళాశాలలో సోమవారం విద్యార్థులతో సంకల్పం ప్రతిజ్ఞ చేయించారు. నేటి యువత మాదక ద్రవ్యాల మత్తులో పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైద్యాధికారి శక్తిప్రియ

ఎస్.రాయవరం: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. జేవీపాలెం గ్రామంలో క్యాన్సర్‌పై అవగాన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే నోటి, లంగ్ క్యాన్సర్లను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అపరాల విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: రబీకి అవసరమైన అపరాలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అపరాల విత్తనాలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలో ఈ విత్తనాలు అందుబాటు ఉంచుతామన్నారు. పెసర ఐపీఎం రకం నాలుగు కేజీల రూ.364, మినుము వీబీఎస్-8 రకం నాలుగు కేజీలు రూ.392 చొప్పున రైతులు పొందవచ్చన్నారు. వరిసాగు చేసిన రైతులు రెల్లు రాల్చు పురుగు నివారణపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. వరికంకి దశలో ఈ పురుగు ఎక్కువగా సోకుతుందని, నివారణకు మందులు పిచికారి చేస్తే నష్టాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు.

అనకాపల్లి-పరవాడ రోడ్డు విస్తరణ కలేనా!

- ఇరుకు మార్గంలో రాకపోకలకు వాహనచోదకుల అవస్థలు
- మరోవైపు ప్రమాదకరంగా మలుపులు
- త్వరితగతిన విస్తరణ చేపట్టాలంటూ ప్రజల విజ్ఞప్తి



ప్రమాదకరంగా మలుపు



విస్తరణ చేయాల్సిన పరవాడ రోడ్డు

మునగపాక: అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడకు వెళ్లే రోడ్డు విస్తరణ కలగా మిగిలిపోయింది. ఇరుకుమయంగా ఉన్న ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 12 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించాల్సిన అవసరం ఉంది. పాలకులు ఈ రహదారిని విస్తరిస్తామంటూ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడ వరకు 12 కిలోమీటర్ల మేర ఇరుకుగా ఉంటుంది. ప్రస్తుతం 12 అడుగులకు మించి ఈ రోడ్డు వెడల్పు లేదు. ఈ రోడ్డు మీదుగా ప్రతి రోజు పరవాడలోని ఫార్మాసిటీ, ఎన్‌టీపీసీ కంపెనీలకు వందలాది ఉద్యోగులు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు మునగపాక మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు అటు అనకాపల్లికి ఇటు పరవాడకు వ్యాపార, ఉద్యోగాలతో పాటు చదువుకునేందుకు విద్యార్థులు సైతం ప్రయాణిస్తుంటారు. అయితే ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ చేపడితేనే గానీ సమస్య పరిష్కారం కాదనే వాదన వినిపిస్తోంది.

ప్రమాదాలకు పిలుపు ఈ మలుపులు

పరవాడ రోడ్డులో పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి ఎక్కడ చూసినా మలుపులే దర్శనమిస్తుంటాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిని విస్తరించడం ద్వారా మలుపుల సమస్య పరిష్కారమవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రోడ్డు వెడల్పు తక్కువ కావడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువగా ఉంటుంది.



టి.సిరసపల్లి వద్ద ప్రమాదకరంగా రోడ్డు

తక్షణం రోడ్డును విస్తరించాలి



అనకాపల్లి నుంచి పరవాడకు వెళ్లే రోడ్డును తక్షణం విస్తరించాలి. నిత్యం వంద లాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరుకు రోడ్డు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీనికి తోడు పలుమార్లు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు స్పందించి రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలి. – మద్దాల వీరునాయుడు, ఎంపీటీసీ, సిరసపల్లి

ప్రభుత్వం దృష్టికి సమస్య

పరవాడ రోడ్డు విస్తరణ అంశం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ రోడ్డు విస్తరణ చేపట్టడం ద్వారా చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ రోడ్డులో నిత్యం వాహనాల రద్దీ కనిపిస్తోంది. రహదారి విస్తరణ ప్రాధాన్యతను ఉన్నతాధికారులకు వివరిస్తాం. – పద్మిని, ఆర్‌అండ్‌బీ ఏఈ

బాధితుడికి బాసట



బాధితుడికి సాయం అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

నక్కపల్లి: పొట్టకూటి కోసం బెంగళూరు వెళ్తూ రైలు ప్రమాదానికి గురై కాలు పోగొట్టుకున్న బాధితుడికి దేవవరం గ్రామానికి చెందిన యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తునికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన కక్కల అజిత్‌కుమార్ కూలి పనుల కోసం పది రోజుల క్రితం బెంగళూరుకు రైల్లో బయలుదేరాడు. రాజమండ్రి స్టేషన్‌లో దిగి బోగీ మారే క్రమంలో ప్రమాదవశాత్తూ కిందపడడంతో రైలు చక్రాలు కాలుపై నుంచి వెళ్లడంతో మోకాలి నుంచి కింద భాగం నుజ్జయింది. వెంటనే ప్రయాణికులు ఆయన్ను గుర్తించి రాజమండ్రి రైల్వే ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ శస్త్ర చికిత్స చేసి నుజ్జయిన కాలు భాగాన్ని తొలగించారు. గీత కార్మిక సామాజిక వర్గానికి చెందిన అజిత్‌కుమార్ వృత్తి పనులతో పాటు, కొబ్బరికాయలు తీయడం, తాటాకులు నరకడం వంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనపై తల్లి ఆధారపడి ఉంది. కాలు కింద భాగం తీసేయడంతో ఇంటికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం పోషణ భారమైంది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న దేవవరం గ్రామానికి చెందిన ఉత్సవ కమిటీ యువకులు రూ.16 వేలు సమకూర్చారు. తుని పట్టణానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు కూడా స్పందించి మరో రూ.10 వేలు సాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తం రూ.26 వేలను సోమవారం బాధితుడు అజిత్‌కుమార్‌కు అందజేశారు.

ఆకట్టుకున్న నాణేలు, స్టాంపుల ప్రదర్శన



నాణేలు, స్టాంపుల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: విద్యార్థులకు చదువుతో పాటు, విజ్ఞానంపై అవగాహన కల్పించాలని లింగరాజుపాలెం సర్పంచ్ అల్లూరి ఉదయకుమారి కోరారు. గ్రామంలో ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన పలు దేశాలు స్టాంప్‌లు, నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ శ్రీధర్ సహకారంతో నాణేలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో బ్రిటిష్ ఇండియావారి నాణేలు, అమెరికా అధ్యక్షుల పేరుతో ఉన్న నాణేలు సేకరించి ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మేఘ ప్రసాద్, స్థానిక నాయకులు గణపతి రాజు, సోమరాజు, కర్రి సూర్యసత్యనారాయణ, కోనా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: నర్సింగబిల్లి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని యలమంచిలి రూరల్, దార్లపూడి ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు, నిర్వహణ పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. యలమంచిలి మున్సిపాలిటీ, మండలంలో ఉన్న చినషేకిళ్లపాలెం, పెదషేకిళ్లపాలెం, కొక్కిరాపల్లి, ఏటికొప్పాక గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మంగళవారం ఉదయం 4 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

- పాటిపల్లి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- 4 తులాల కాసుల పేరు బహూకరించిన భక్తులు



కాసుల పేరును అందజేస్తున్న దాతలు



పాటిపల్లిలో శివపార్వతుల కల్యాణంలో భక్తులు

మునగపాక: పాటిపల్లిలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఏటా కార్తీక మాసం ఆఖరి సోమవారం కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా గాజువాకకు చెందిన భీశెట్టి మహాలక్ష్మినాయుడు-లక్ష్మి దంపతుల ప్రోత్సాహంతో 15 మంది దాతల సహకారంతో 4 తులాల బంగారం సేకరించి అమ్మవారికి కాసుల పేరు తయారు చేసి బహూకరించారు. కల్యాణం తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు.

‘స్పందన’తో ప్రజా సమస్యల పరిష్కారం



మునగపాక మండల పరిషత్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(స్పందన) దోహదపడుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో ఏర్పాటు చేసిన స్పందనలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ సందేశాన్ని తిలకించారు. ప్రతి సోమవారం మండల కార్యాలయాల వద్ద అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఏవో ప్రసాద్, ఈవోఆర్డీ ఎం.సోమరాజుతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు దరఖాస్తులు స్వీకరించారు.

ఘనంగా సాంబశివుని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాకలో సోమవారం రాత్రి సాంబశివుని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాల నడుమ విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు గ్రామంలోని వీధుల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు సాంబశివున్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమగ్రంగా సామాజిక తనిఖీ నివేదిక

- చేసిన పనులకు, చెల్లింపులకు మధ్య వ్యత్యాసం
- నక్కపల్లిలో సామాజిక తనిఖీల్లో వెల్లడి



సోషల్ ఆడిట్ కార్యక్రమంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న వాగ్వాదం

నక్కపల్లి: మండలంలో నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పలు లోపాలు వెలుగు చూశాయి. వారం రోజుల నుంచి సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో గతేడాది కాలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు చేసిన చెల్లింపులపై తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు సోమవారం నక్కపల్లి మండల కాంప్లెక్స్ వద్ద సోషల్ ఆడిట్ నిర్వహించారు. ముఖ్యంగా చిన తీనార్ల, పెదతీనార్ల గ్రామాల్లో అత్యధికంగా సుమారు రూ.30 లక్షలు స్వాహా జరిగినట్లు స్థానిక సర్పంచ్ మైలపల్లి శ్రీను సోమవారం జరిగిన మండల స్థాయి సోషల్ ఆడిట్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో ఈ పనులపై జరిగిన సామాజిక తనిఖీ నిర్వహించిన ప్రత్యేక బృందం సభ్యులు కూడా నిధులు దుర్వినియోగమైనట్టు గుర్తించారన్నారన్నారు. పెదతీనార్లలో ఉపాధి పనులకు హాజరు కాకుండానే బినామీ మస్తర్లు వేసినట్టు నిర్ధారించారు. ఏపీవో, ఎంపీడీవో, ప్రోగ్రాం అధికారుల సంతకాలు లేకుండా పనులకు చెల్లింపులు జరిపిన విషయం తనిఖీల్లో వెల్లడైంది. ఈ గ్రామాల్లో ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలను సర్పంచ్ శ్రీనుతో పాటు పలువురు సామాజిక తనిఖీ బృందం దృష్టికి తీసుకెళ్లిన సమయంలో ప్రత్యర్థి వర్గం ఎదురు దాడికి దిగింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై ఏపీవో భాగ్యలతను వివరణ కోరగా.. జీవో నంబరు 1073 ప్రకారం ఎర్త్ వర్క్‌ల కాలపరిమితి ఆరు నెలలు మాత్రమేనన్నారు. ఏడాది దాటిన తర్వాత ఈ పనులకు సంబంధించిన కొలతలు పూర్తిగా వచ్చే అవకాశం లేదన్నారు. చెరువుల్లో తీసిన గోతులు వర్షాలు పడిన తర్వాత కొలిస్తే తేడా ఉంటుందన్నారు. ఇలాంటి వాటిని అదనపు చెల్లింపులుగా భావించరాదన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ పూర్ణిమాదేవి, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, ఇన్‌చార్జ్ ఏపీవో యరకయ్య, ఎంపీడీవో సీతారామరాజు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎస్ఆర్‌పీ నాగరాజు, ఏపీవో భాగ్యలత పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామ స్మరణ

- భక్తులతో పోటెత్తిన శివాలయాలు
- ఘనంగా ఆఖరి సోమవారం పూజలు



రాధామాధవస్వామి ఆలయం వద్ద పుణ్యధారల్లో స్నానమాచరిస్తున్న భక్తులు



పంచదార్ల పుణ్యక్షేత్రంలో ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రేబాకలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నక్కపల్లి: ఆఖరి కార్తీక సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉపమాక భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయంలో వేకువజామునే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులు క్యూలో వేచి ఉండి పరమేశ్వరుడ్ని దర్శించుకున్నారు. ధ్వజ స్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. నవగ్రహాల వద్ద కూడా పూజలు నిర్వహించారు. గొడిచర్లలో శేషలింగేశ్వరాలయం, ఒడ్డిమెట్ట కాశీవిశ్వేశ్వరాలయాలకు కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

– రేబాక గూడుపమ్మతల్లి ఆలయంలో కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు చేశారు. ముందుగా ఈశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. రేబాక, రేవళ్లు, తిరుపతి పాలెం గ్రామాలకు చెందిన వందలాది మంది మహిళలు ఈ కుంకుమ పూజలో పాల్గొని తరించారు. ఏలూరుకు చెందిన యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వామి హాజరై భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఎంతో మహిమ గల గూడుపమ్మతల్లి వెలసిన రేబాక భవిష్యత్‌లో అత్యంత ఆదరణ గల క్షేత్రంగా విరాజిల్లుతుందని చెప్పారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొట్టుముక్కల శ్రీహరిరాజు, సాదిరెడ్డి శ్రీను, శోభారాణి, గురుభవానీ రాంబాబు పాల్గొన్నారు.

భక్తులతో పంచదార్ల క్షేత్రం కిటకిట

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం పంచదార్ల పుణ్యక్షేత్రానికి సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు ఉమాధర్మలింగేశ్వరుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కొండ దిగువన రాధామాధవ స్వామి ఆలయం వద్ద ఉన్న పుణ్యధారల్లో భక్తులు పవిత్ర కార్తీక స్నానాలు ఆచరించి పక్కన ఉన్న సింహాద్రి అప్పన్న పాదాల వద్ద ప్రత్యేక పూజలు అనంతరం శివలింగానికి పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. కొండ మీద ఉన్న ఉమాధర్మలింగేశ్వరుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉమాధర్మలింగేశ్వరునికి పంచామృతాభిషేకాలు చేశారు. పలువురు దంపతులు కుంకుమ పూజల్లో పాల్గొని తరించారు. క్షేత్రంలో ఉన్న కాశీవిశ్వేశ్వరునికి, లలితా సహస్రలింగేశ్వరునికి, ద్విముఖ వినాయకుని ఆలయం వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ సుందరపు లోవరాజు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మునగపాక: మండలంలోని పలు శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. కార్తీకమాసంలోని సోమవారం కావడంతో భక్తులు శివాలయాలకు తరలివెళ్లి పూజలు నిర్వహించారు. మునగపాక లింగరాయి గుడిలో వేదపండితుడు సోమశేఖర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరుని ఆలయం, సిరసపల్లిలోని వీరభద్రస్వామి ఆలయంతో పాటు నాగులాపల్లిలోని పురాతన శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది.

కోటవురట్ల: మండల కేంద్రంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, చిన లింగాపురంలోని దుర్గా మల్లేశ్వర అయ్యప్ప ఆలయం,యండపల్లి శివారు ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో క్షీరాభిషేకాలు చేశారు. ఆఖరి సోమవారం కావడంతో వేకువ జాము నుంచి వరాహ, సర్పా నదులకు చేరుకున్న భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాలలో పూజలు చేశారు.

రేబాకలో సామూహిక కుంకుమ పూజలు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం బుద్రేశ్వర స్వామి, సర్వసిద్ధి శ్రీసిద్ధి లింగేశ్వరస్వామి పెదఉప్పలం బ్రహ్మలింగేశ్వరస్వామి, పెదగుమ్ములూరు ఉమాలింగేశ్వరస్వామి, దార్లపూడి వరాహ లింగేశ్వరస్వామి, వేమగిరి, పెనుగొల్లు కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వేకువ జాము నుంచి శివునికి అభిషేకాలు, అర్చనలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

యలమంచిలి రూరల్: కార్తీక మాసం నాలుగో సోమవారం యలమంచిలి పట్టణం, మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్తపేట పురాతన ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే అభిషేకాలకు భక్తులు బారులు తీరారు. ప్రధాన రహదారి పక్కనున్న త్రిమూర్తులుస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. శేషగెడ్డ శివాలయం, గాజువాక బైపాస్ రోడ్డు సోమస్కంధమూర్తి ఆలయం, సోమలింగపాలెం, ఏటికొప్పాక, కొక్కిరాపల్లి, పులపర్తి, పద్మనాభరాజుపేట, తెరువుపల్లి గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



యలమంచిలి కొత్తపేట ఉమాధర్మలింగేశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు



ఉపమాక శివాలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు



కోటవురట్ల శివాలయంలో భక్తులు



మునగపాకలో పూజలు చేస్తున్న మహిళలు



మునగపాక లింగరాయి గుడిలో పూజలు



యలమంచిలి కాశీవిశ్వేశ్వర త్రిమూర్తులు స్వామి ఆలయంలో భక్తుల పూజలు



పెదఉప్పలం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో..